సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
90324 97123
నంబర్‌ను సంప్రదించండి

ఆక్రమణలతో ట్రాఫికర్



అల్లిపురం మోడల్ స్కూల్ వద్ద నిలిచిపోయిన ట్రాఫిక్



కెప్టెన్ రామారావు జంక్షన్ వద్ద రోడ్డుపై దుకాణదారులు పేర్చిన వస్తువులు

- ఇరుకుగా మారిన అల్లిపురం మెయిన్ రోడ్డు
- రోడ్డుపైనే సామగ్రి పేర్చేస్తున్న దుకాణదారులు
- గూడ్సు వాహనాలతో స్తంభిస్తున్న ట్రాఫిక్

అల్లిపురం : ఒకప్పుడు సిటీ బస్సు నడిచిన మార్గంలో ప్రస్తుతం ఆటోలు రాకపోకలు సాగించడమూ కష్టంగా మారిపోయింది... ఇరువైపులా రోడ్డు స్థలం ఆక్రమణకు గురికావడంతోపాటు వ్యాపారులు రోడ్లపైనే సామగ్రి పేరుస్తుండడంతో ఇరుకుగా మారిపోయింది. ఇదీ అల్లిపురం మెయిన్‌రోడ్డు పరిస్థితి. ఈ మార్గంలో నిత్యం ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదంటూ వాహనచోదకులు, పాదచారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సౌత్ జైలురోడ్డు, కెప్టెన్ రామారావు జంక్షన్ వద్ద రోడ్డు వెడల్పుగా ఉన్నప్పటికీ... అల్లిపురం మార్కెట్ జంక్షన్ నుంచి కోదండ రామాలయం వరకు మొత్తం ఆక్రమణలకు గురికావటంతో 10 అడుగుల మార్గం కూడా కనిపించడం లేదు. అల్లిపురం మెయిన్ రోడ్డులో జీవీఎంసీ మోడల్ స్కూల్ ఉండటంతో పాఠశాల ప్రారంభించే సమయంలో, సాయంత్రం వదిలిపెట్టే సమయంలో ట్రాఫిక్ అధికంగా ఉంటోంది. ఆ సమయంలో పిల్లలు ప్రమాదాలకు గురవుతారేమోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నిత్యం ట్రాఫిక్ జామ్

అల్లిపురం మెయిన్ రోడ్డులో కుమ్మరవీధి జంక్షన్, గాంధీ బొమ్మ జంక్షన్, బంగారుమెట్ట, జీవీఎంసీ మోడల్ స్కూల్, సింహాలదేవిడితోపాటు కెప్టెన్ రామారావు జంక్షన్‌లో ఎలక్ట్రికల్, ప్లంబింగ్, శానిటరీ విక్రయాల దుకాణాలు ఎక్కువగా వున్నాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో దుకాణదారులు వస్తువులను రోడ్డుపైనే పేర్చుతున్నారు. వాటికితోడు లోడింగ్, అన్‌లోడింగ్ కోసం వచ్చే సరకు రవాణా వాహనాలు గంటలకొద్దీ నిలిచిపోవడంతో ట్రాఫిక్ స్తంభించిపోతోంది. ఒక పక్క ఎండలు, మరో పక్క ట్రాఫిక్ నిలిచిపోవడంతో వాహనచోదకులు, పాదచారులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులు మెయిన్ రోడ్డులో ఆక్రమణలు తొలగించి ట్రాఫిక్ క్లియర్ చేయాలని కోరుతున్నారు.

నిత్యం ట్రాఫిక్ సమస్యలే



అల్లిపురం మెయిన్ రోడ్డులో అడుగడుగునా ట్రాఫిక్ నిలిపోతోంది. ఈ రోడ్డుపై ప్రయాణమంటేనే నరకం కనిపిస్తోంది. అల్లిపురం మార్కెట్‌కు వెళ్లే మహిళలు రోడ్డు దాటాలంటే భయపడుతున్నారు. నిత్యం ట్రాఫిక్ నిలిచిపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ట్రాఫిక్ పోలీసులు స్పందించి సమస్య పరిష్కరించాలి.

– పాల శ్రీహరి రెడ్డి, అల్లిపురం

గూడ్సు వాహనాలతో సమస్య



కెప్టెన్ రామారావు జంక్షన్ నుంచి సింహాలదేవిడి వరకు హోల్‌సేల్, రిటైల్ దుకాణాలు అధికంగా ఉండడంతో గూడ్సు వాహనాలు అధికంగా ఉంటున్నాయి. లోడింగ్ అన్‌లోడింగ్ చేసేందుకు గంటల కొద్దీ వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్ స్తంభించిపోతోంది. రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిపివేయడంతో ఈ పరిస్థితి ఎదురవుతోంది.

– బడే నాగరాజు, కెప్టెన్ రామారావు జంక్షన్

క్లుప్తంగా

ఆ భవనం కూలిపోలేదు.. కూలగొడుతున్నారు



డాబాగార్డెన్స్‌లో శిథిలావస్థలో ఉన్న భవనాన్ని కూలుస్తున్న కార్మికులు

డాబాగార్డెన్స్: డాబాగార్డెన్స్‌లోని హిరావత్ షోరూం పక్కన శిథిలావస్థలో ఉన్న ఓ భవనం ఉన్నట్టుండి కూలిపోయిందని రూమర్ షికార్లు చేసింది. వాస్తవానికి ఆ బిల్డింగ్ యజమాని శిథిలావస్థలో ఉన్న భవనాన్ని కూల్చివేసి నిర్మాణాలు చేపట్టడానికి కొద్ది రోజులుగా సిబ్బందిచే పనులు చేయిస్తున్నాడు. 2008లో బిల్డింగ్ నిర్మాణం కూలిన సందర్భంలో ఇద్దరు మృతి చెందారు. అప్పటి నుంచి ఈ బిల్డింగ్ నిర్మాణం కొన్ని కారణాల వల్ల జరగలేదు. ఇటీవల ఈ భవన నిర్మాణానికి సంబంధించి యజమాని నిర్మాణ పనులు చేపట్టేందుకు శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగా సిబ్బంది కూలుస్తున్న సమయంలో పిల్లర్లు ఒక్కసారిగా నేలకొరిగాయి. ఈ ఘటనపై పలువురు పుట్టించిన పుకార్లు.. షికార్లు చేశాయి.

ఘనంగా యూత్ రిట్రీట్



దైవ సందేశమిస్తున్న శ్యామ్ మింది

డాబాగార్డెన్స్: స్థానిక గొల్లలపాలెంలోని పెంతెకోస్తు చర్చ్‌లో సోమవారం యూత్ రిట్రీట్ ఘనంగా నిర్వహించారు. రిఫ్యూజ్ మినిస్ట్రీస్ వ్యవస్థాపక అధ్యక్షుడు రెవరెండ్ శ్యామ్ మింది నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాస్టర్లు బెంజిమిన్, వినోద్, జేమ్స్ యేహెజ్కేల్ పాల్గొని దైవ సందేశమిచ్చారు. యువకులు సరైన మార్గంలో నడవాలని సూచించారు. న్యాయవాది ఎం.జె.జి.రాజు మాట్లాడుతూ యువత మంచి నడవడిక కలిగి దైవ సేవలో ముందుకెళ్లాలని పలు సూచనలు చేశారు. సుమారు 250 మంది యువతీ యువకులు యూత్ రిట్రీట్‌లో పాల్గొని ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీలో విజేతలుగా నిలిచిన వారికి ప్రముఖుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జి.పాల్‌విక్టర్, పాస్టర్ ప్రేమ్‌కుమార్, స్నేహప్రియ, మింది ఇజ్రాయిల్, బర్నబాస్, అహరోన్ ఆశీర్వాద్, అబిగేల్, సోను తదితరులు పాల్గొన్నారు.

వితంతువుల పెన్షన్ స్కీంపై అవగాహన



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

డాబాగార్డెన్స్: స్టేట్ లీగల్ సర్వీసెస్ ఆదేశాల మేరకు సోమవారం డాబాగార్డెన్స్‌లోని సచివాలయంలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.వెంకట శేషమ్మ పాల్గొని వితంతువుల పెన్షన్ స్కీంపై మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్థానిక మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

అల్లిపురం : రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఒకటి కాలువలో గుర్తించారు. అల్లిపురం సౌత్ జైలు రోడ్డు నుంచి దొండపర్తి సమీప డీఆర్‌ఎం కార్యాలయానికి వెళ్లే దారిలో కాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు ఆదివారం రాత్రి టూ టౌన్ పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీశారు. మృతుని వయసు సుమారు 40 నుంచి 50 సంవత్సరాల మధ్య వుంటుందని, ఆచూకీ తెలిసిన వారు 94409 04716, 83310 41627లో తెలియజేయాలని సీఐ బి.తిరుమల రావు కోరారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించిన పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ సౌత్
7997958342, 9912440606

వైభవంగా శ్రావణ మాస పూజలు



విశేష అలంకరణలో కనక మహాలక్ష్మి అమ్మవారు

డాబాగార్డెన్స్ : శ్రావణమాసాన్ని పురస్కరించుకొని కనక మహాలక్ష్మి దేవస్థానంలో నిర్వహిస్తున్న ప్రత్యేక పూజలు సోమవారం నాటికి 8వ రోజుకి చేరుకున్నాయి. అమ్మవారికి వేదమంత్రాలు, నాదస్వర సుస్వరాల మధ్య ఉదయం 8.10 గంటలకు శ్రావణలక్ష్మి పూజలు ప్రారంభించారు. పలువురు ఉభయదాతలు విశిష్ట పూజలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి పి.శ్రీనివాసులరెడ్డి, ఏఈవో వెంపలి రాంబాబు, వేద పండితులు, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు అష్టదళ పద్మారాధన

ఉత్తరాంధ్రుల కల్పవల్లి కనక మహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891 2711725, 2566514కు ఫోన్ చేయవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు జమచేసి పేరు, గోత్రనామం, చిరునామాను 8985515989 వాట్సాప్ నంబర్‌కు పంపాలి. ఆన్‌లైన్ సేవలు, పూజల కోసం aptempel.ap.gov.in website ద్వారా పొందవచ్చు.

భారీ గణేశుడికి సిద్ధమవుతున్న మండపం



దొండపర్తిలో కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పందిరి నిర్మిస్తున్న కార్మికులు

సీతమ్మధార: జీవీఎంసీ 27వ వార్డు దొండపర్తి రామాలయం సమీపంలో శ్రీవరసిద్ధి వినాయక పూజా మహోత్సవ కమిటీ ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాలకు సన్నాహాలు జరుగుతున్నాయి. కమిటీ అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు నీలాపు సర్వేశ్వరరెడ్డి పర్యవేక్షణలో కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మండపం ఏర్పాటు పనులు చేస్తున్నారు. ఈ ప్రాంతంలో వరుసగా ఐదో ఏట వినాయక చవితి ఉత్సవాలు నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. హైదరాబాద్‌లో తయారు చేయిస్తున్న గణపతి విగ్రహాన్ని ఇక్కడ ప్రతిష్టిస్తామని చెప్పారు. వినాయక చవితికి రెండు రోజుల ముందుగానే విగ్రహం విశాఖకు చేరుకుంటుందన్నారు. ఉత్సవాల్లో భాగంగా పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలు, హోమాలు, సాముగరిడీలు, ప్రతి రోజూ భక్తులచే భజనలు ఉంటాయని తెలిపారు. అనుపు మహోత్సవానికి రెండు రోజుల ముందు మహా అన్నదానం చేస్తామని సర్వేశ్వరరెడ్డి 'సాక్షి'కి తెలిపారు. స్థానిక కార్మికులు కొద్ది రోజులుగా భారీ మండపం ఏర్పాటు పనులు చేస్తున్నారు. ఇనుప రాడ్లతో పందిరి నిర్మిస్తున్నారు.

మోడలింగ్‌లో మెరిసిన రిషిక



రెండో స్థానంలో నిలిచి ట్రోఫీ కైవసం చేసుకున్న తన్వీ రిషిక

డాబాగార్డెన్స్: థాయిలాండ్‌లో జరిగిన జూనియర్ మోడల్స్ ఇంటర్నేషనల్ పోటీలో నగరానికి చెందిన తన్వీ రిషిక విశేష ప్రతిభ కనబరచి రెండో స్థానంలో నిలిచింది. వివిధ దేశాల విజేతల మధ్య జరిగిన హోరాహోరీ పోటీల్లో ప్రి టీన్ కేటగిరీలో నగరానికి చెందిన తన్వీ రిషిక రెండో స్థానంలో నిలిచి ట్రోఫీ కైవసం చేసుకుంది. కాస్ట్యూమ్స్ విభాగంలో బెస్ట్ రిప్రజంటేషన్ ఫ్రమ్ ఇండియా, సూపర్ టాలెంట్ ఆఫ్ సీజన్ అవార్డులను సొంతం చేసుకుంది. ఈ సందర్భంగా తన్వీ రిషిక మాట్లాడుతూ తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఇప్పటికే చాలా ఫ్యాషన్ షోల్లో విజేతగా నిలిచానని తెలిపింది. రిషిక తండ్రి సురేష్ కుమార్ మాట్లాడుతూ చిన్నప్పటి నుంచి తన కుమార్తెకు ఉన్న ఆసక్తిని గుర్తించి ఫ్యాషన్ రంగంలో ప్రోత్సహిస్తున్నట్టు తెలిపారు. తన్వీ తల్లి ప్రసన్న రేణుక మాట్లాడుతూ విశాఖలో నిర్వహించిన ఆంధ్రా ఫ్యాషన్ పోటీల్లో కూడా తన కుమార్తె విజేతగా నిలిచిందన్నారు. ఈ సందర్భంగా ఫ్యాషన్ రంగంలో జారీ ఎత్నిక్ వేర్, సూర్యప్రభ నందిని, రోహిత్, అరుణ్‌రతన్, నరీస్ మాష్టర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు అన్యాయం



మాట్లాడుతున్న విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి తనికెళ్ల సత్యరవికుమార్

సీతమ్మధార : బంగ్లాదేశ్‌లో హిందువుల మీద దాడులు జరుగుతున్నా ప్రపంచ దేశాలు మౌనం పాటించడం శోచనీయమని విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) రాష్ట్ర కార్యదర్శి తనికెళ్ల సత్యరవి కుమార్ విచారం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురుద్వారా వద్ద గల స్మార్ట్ ఇన్ అతిథి గృహంలో సోమవారం సాయంత్రం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బంగ్లాదేశ్‌లో రిజర్వేషన్ పేరిట సాగుతున్న ఉద్యమంలో హిందువులను ఊచకోత కోయడం అన్యాయమన్నారు. ఇంత జరుగుతున్నా ప్రపంచ దేశాలు మౌనవ్రతం చేస్తున్నాయని ఎద్దేవా చేశారు. బంగ్లాదేశ్‌లో 1947, 1971, 2024 సంవత్సరాల్లో జరిగిన ఉద్యమాల్లో హిందువులే నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. బంగ్లాదేశ్‌లో హిందూ మహిళల పట్ల అమానుష దాడులు జరగడం గర్హనీయమన్నారు. బంగ్లాదేశ్ ఉద్యమం పేరిట భారత్‌లోకి చొరబాట్లు జరగకుండా కేంద్ర ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికైనా ఐకరాజ్యసమితి, మానవ హక్కుల సమితి, మహిళా సంఘాలు ముందుకొచ్చి స్పందించాలని ఆయన కోరారు. విశ్వ హిందూ పరిషత్ నాయకులు భూపతిరాజు సుబ్బరాజు, విశ్వనాథం, బాబ్జీ పాల్గొన్నారు.

వైద్య విద్యార్థుల కొవ్వొత్తుల ప్రదర్శన



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య విద్యార్థులు

మహారాణిపేట: కోల్‌కతాలో పీజీ ట్రైనీ డాక్టర్‌పై జరిగిన ఘాతుకానికి నిరసనగా సోమవారం వైద్య విద్యార్థులు కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు. ఆంధ్రా మెడికల్ కాలేజీ జూడో వైద్యుల ఆధ్వర్యంలో ఏఎంసీ నుంచి కేజీహెచ్ వరకు వైద్య విద్యార్థులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. వైద్య విద్యార్థుల సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జి.పృథ్వీరాజ్, కార్యదర్శి డాక్టర్ వై.రాజ్ వివేక్, ఉపాధ్యక్షుడు డాక్టర్ ఒ.రాపేటీ తదితరులు పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో వన్‌టౌన్ సీఐ పర్యటన



కేజీహెచ్‌లో పర్యటిస్తున్న సీఐ భాస్కరరావు

మహారాణిపేట: కేజీహెచ్‌లో సోమవారం వన్‌టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ భాస్కరరావు పర్యటించారు. పిల్లల అనధికార విక్రయాల కేసులో తల్లి, పిల్లను కేజీహెచ్‌లో పిల్లల వార్డుకు తరలించారు. ఈ నేపథ్యంలో పలు వార్డులను సీఐ సందర్శించారు. పిల్లల వార్డు, ప్రసూతి వార్డుల్లో పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. సీసీ కెమెరాలను పరిశీలించారు.

రైల్వే స్టేషన్‌లో గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వే స్టేషన్‌లో గంజాయి అక్రమ రవాణా చేస్తున్న యువకులను రైల్వే పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు. జీఆర్పీ, ఆర్పీఎఫ్ ఉన్నతాధికారులు ఆదేశాలతో రైల్వేస్టేషన్‌లో జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఆర్పీఎఫ్ ఎస్ఐ ఎంఎల్ మీనా రైల్వేస్టేషన్‌లోని వివిధ ప్లాట్‌ఫాంలలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఒడిశా రాష్ట్రం బోలంగీర్‌కు చెందిన దోలమని రానా, బీహార్‌కు చెరందిన శివశంకర్ రేలు గంజాయి రవాణా చేయడాన్ని గుర్తించారు. విశాఖ మీదుగా ముంబై, హౌరాలకు తరలిస్తున్నట్లు విచారణలో తేలింది. వీరి నుంచి సుమారు రూ.77,500 విలువైన 15.5కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీరిని జీఆర్పీ ఎస్ఐ శాంతారంకు అప్పగించగా, వీరిని అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరచినట్లు జీఆర్పి సిబ్బంది తెలిపారు.

మహిళా హాస్టళ్లలో సీసీ కెమెరాలు తప్పనిసరి



లేడీస్ హాస్టల్‌లో యువతులకు అవగాహన కల్పిస్తున్న క్రైం ఎస్ఐ రాజు

సీతమ్మధార : మహిళా హాస్టళ్లలో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ద్వారకా పోలీస్ స్టేషన్ క్రైం ఎస్ఐ రాజు కోరారు. ఈ మేరకు ఆయన శ్రీనగర్‌లో గల ప్రియా లేడీస్ హాస్టల్‌లో సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్టల్‌లో లాకర్లు ఏర్పాటు చేయడం ద్వారా చోరీలు నివారించవచ్చన్నారు. అలాగే, హాస్టల్‌లో వుండే యువతులు బంగారు ఆభరణాల భద్రత విషయంలో నిర్వాహకులు కూడా అప్రమత్తంగా వుండాలని సూచించారు. నగదు, ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు లాకర్‌లో మాత్రమే భద్రపరుచుకోవాలని సూచించారు. హాస్టళ్లలో వుండే యువతులు చెడు స్నేహాలకు దూరంగా వుండాలని హితవు పలికారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, హాస్టల్ మేట్రిన్ రమ, పాల్గొన్నారు.

రంగనాథన్ సేవలు మరువలేనివి



రంగనాథన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి తదితరులు



రంగనాథన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పాఠకులు

డాబాగార్డెన్స్ : జిల్లా కేంద్ర గ్రంథాలయంలో డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్ జయంతి, నేషనల్ గ్రంథ పాలకుల దినోత్సవం సోమవారం నిర్వహించారు. ముందుగా జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్ సీహెచ్ వెంకటరావు జ్యోతి ప్రజ్వలన చేసి రంగనాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ రంగనాథన్ సేవలు కొనియాడారు. ప్రతి ఒక్కరూ రంగనాథన్‌ను ఆదర్శంగా తీసుకోవాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డిప్యూటీ లైబ్రేరియన్ పీవీఎస్ రాజు, ఇన్‌చార్జి అసిస్టెంట్ లైబ్రేరియన్ ఎల్.రాజేంద్రవర్మ, సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

◆ జీవీఎంసీ 36వ వార్డు రంగిరీజువీధిలోని బాలల శాఖ గ్రంథాలయంలో రంగనాథన్ జయంతి నిర్వహించారు. ముందుగా గ్రంథాలయ సీనియర్ పాఠకుడు ఎస్.అప్పారావు నివాళులర్పించారు. అనంతరం గ్రంథాలయ అధికారి టి.పోలితల్లి మాట్లాడుతూ ఎస్ఆర్ రంగనాథన్ మద్రాసు రాష్ట్రం షియాలి అనే గ్రామంలో జన్మించారని, అక్కడే పాఠశాల విద్యాభ్యాసం కొనసాగించారని, చిన్నతనం నుంచే గణితంపై ఆసక్తితో గణితంలో ప్రొఫెసర్‌గా యూనివర్శిటీ ఉద్యోగం సంపాదించారన్నారు. ఆయన ఎక్కువ కాలం గ్రంథాలయంలోనే గడిపేవారన్నారు. పుస్తకాల మీద ఆసక్తితో గ్రంథాలయంలో కోలన్ క్లాసిఫికేషన్‌ను కనుగొన్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంఏ రాజు, ఎస్.ఎల్లారావు, వై.పద్మ తదితరులు పాల్గొన్నారు.

5 శాతం రిజర్వేషన్ కల్పించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ చెన్నా జానకీరామ్ తదితరులు

డాబాగార్డెన్స్ : సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అన్ని రంగాల్లో వెనుకబడిన రెల్లి కులస్థులకు 5 శాతం రిజర్వేషన్ కల్పించాలని 37వ వార్డు కార్పొరేటర్ చెన్నా జానకీరామ్ కోరారు. ఈ మేరకు తన సామాజిక వర్గ సభ్యులతో కలిసి సోమవారం రెల్లివీధి నుంచి ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చెన్నా మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని, అయితే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఉన్నప్పుడు అత్యధిక మంది మాదిగలు ఉండేవారని, రాష్ట్రం విడిపోయిన తర్వాత ఆంధ్రాలో 40 నుంచి 50 లక్షల వరకు రెల్లి కులస్థులు ఉన్నారని చెప్పారు. రెల్లీలకు విద్యావకాశాలు ఎల్‌కేజీ నుంచి పీజీ వరకు అందించాలని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని, నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యమివ్వాలని, రెల్లి పారిశుధ్య కార్మికులను అన్ని విధాలా ఆదుకోవాలని, పండ్లు, కాయలు అమ్ముకునే రెల్లీలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రుణాలు మంజూరు చేయాలని కోరారు. రెల్లీలకు ఏ ప్రభుత్వమైనా ఎస్సీ రిజర్వేషన్ కింద సీటు కేటాయించాలని డిమాండ్ చేశారు. మరీ ముఖ్యంగా ఎస్సీ వర్గీకరణలో రెల్లి కులస్థులకు 5 శాతం రిజర్వేషన్ కల్పించాలని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో రెల్లి కుల సంఘ నాయకులు చొక్కాకుల రాంబాబు, కస్తూరి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

యూజీడీ కార్మికులకు వేతనాలు చెల్లించాలి



నిరసన తెలుపుతున్న సీఐటీయూ నేత వెంకటరెడ్డి, యూజీడీ కార్మికులు

సీతమ్మధార: జీవీఎంసీ యూజీడీ కార్మికులకు కొత్త వేతనాలు వెంటనే చెల్లించాలని జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) గౌరవాధ్యక్షుడు పి.వెంకటరెడ్డి కోరారు. ఆశీలమెట్ట జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సోమవారం జరిగిన నిరసన ప్రదర్శనలో ఆయన మాట్లాడారు. జీవో 36 ప్రకారం ఈ ఏడాది మార్చి నుంచి కొత్త వేతనాలు చెల్లించాల్సి ఉందని గుర్తు చేశారు. జీవీఎంసీ ఎస్ఈ కూడా జీవో ప్రకారం వేతనాల నిమిత్తం ఫైల్ పెట్టారని తెలిపారు. గత కమిషనర్ బదిలీ కారణంగా కొత్త వేతనాలు అందని పరిస్థితి నెలకొందన్నారు. ఫైల్ క్లియర్ చేయాలని కొత్త జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశామని వెంకటరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు టి.నూకరాజు, ప్రధాన కార్యదర్శి ఉరికూటి రాజా, కోశాధికారి ఎం.సూరీడు, యూనియన్ నాయకులు, అధిక సంఖ్యలో యూజీడీ కార్మికులు పాల్గొన్నారు.

ఏవీఎన్ కళాశాలలో అంతర్జాతీయ యూత్ డే



విజేతలతో ఏవీఎన్ కళాశాల ప్రిన్సిపాల్, సెట్విస్ సిబ్బంది

అల్లిపురం : యువజన సర్వీసుల శాఖ (సెట్విస్) ఆధ్వర్యంలో ఏవీఎన్ కళాశాలలో సోమవారం అంతర్జాతీయ యూత్ డే ఘనంగా నిర్వహించారు. సెట్విస్ సీఈవో కీర్తి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఏవీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సింహాద్రినాయుడు పాల్గొని మాట్లాడారు. యువత చెడు దారి పట్టకుండా సమాజానికి ఉపయోగపడే పనులు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా వక్తృత్వ, వ్యాసరచన, వాలీబాల్, త్రోబాల్, కబడ్డీ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సెట్విస్ మేనేజర్ వెంకటేష్, రిసోర్స్ పర్సన్ ఎస్ఏ బాబు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ అర్చన, ఆదినారాయణ, సుష్మిత దాస్ పాల్గొన్నారు.

10వేల మందితో త్రివర్ణ పతాక ర్యాలీ రేపు



వివరాలు వెల్లడిస్తున్న బసవ కృష్ణమూర్తి

డాబాగార్డెన్స్: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా బుధవారం వైఎస్సార్ సెంట్రల్ పార్క్‌లో 10 వేల మంది విద్యార్థులతో..25వేల చదరపు అడుగుల త్రివర్ణ పతాకాన్ని ప్రదర్శించనున్నట్టు స్టూడెంట్స్ యునైటెడ్ నెట్‌వర్క్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాజేటి బసవ కృష్ణమూర్తి తెలిపారు. సోమవారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో కార్యక్రమ వివరాలు వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉత్తరాంధ్ర విద్యార్థి సేవ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ సుంకరి రమణమూర్తి కోరారు. కార్యక్రమంలో గొల్ల ప్రదీప్‌రాజు, కర్రి నరేష్, ఇషాక్ మహ్మద్, పీవీకే కుమార్, శివ దల్లై, తమ్మన విజయ్, శ్రీకాంత్, రామాయణం సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

మాన్యువల్ స్కావెంజర్స్‌పై సర్వే

మహారాణిపేట : సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం దేశంలో మాన్యువల్ స్కావెంజర్స్ సర్వే నిర్వహిస్తున్నారని కలెక్టర్, మాన్యువల్ స్కావెంజర్స్ కమిటీ చైర్మన్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ తెలిపారు. జిల్లాలోని అధికారులతో సోమవారం ఆయన సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో ఆగస్టు నెల చివరి నాటికి సర్వే పూర్తి చేయాలని సూచించారు. మున్సిపల్, పంచాయతీ స్థాయిలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ సౌత్
9010810033, 9010196663
Office mail : sakshiadvtvsp@gmail.com